నీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూస్తాం

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

హౌసింగ్‌బోర్డు కాలనీలో రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కార్పొరేషన్, ఏప్రిల్ 1: కరీంనగర్‌లో వేసవి కాలంలో ఎక్కడా మంచి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తామని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా 17,263 రేషన్ దుకాణాల ద్వారా 2 లక్షల 91 వేల రేషన్ కార్డులకు 1.91 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేపట్టామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదవారికి తినడానికి సరిపోయేలా సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. నూతన రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎల్ఎండీలో తాగునీటికి అవసరమైన మేరకు నీటి మట్టం ఉండేలా చూస్తామన్నారు. రైతులకు సాగునీటికి ఇబ్బంది లేకుండా ఎల్ఎండీ నుంచి దిగువకు ఈ నెల 6 వరకు నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్‌డీవో మహేశ్వర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ధర్నాకు అన్ని పార్టీలు సహకరించాలి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఢిల్లీలో చేపట్టే ఆందోళన కార్యక్రమానికి బీసీ సంఘాలతో పాటు, అన్ని పార్టీలు కూడా కలిసి రావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని పార్టీల ఎంపీలు పాల్గొంటారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్ కూడా కలిసి రావాలని కోరారు. తమిళనాడు తరహాలో ఈ చట్టాన్ని తెలంగాణలో అమలు చేసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన శాతవాహన వీసీ



కేంద్రమంత్రికి బండి సంజయ్‌తో కలిసి వినతి పత్రం అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కమాన్‌చౌరస్తా/ విద్యానగర్, ఏప్రిల్ 1: శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర స్పోర్ట్స్, యువజన వ్యవహారాల మంత్రి మన్సూక్ మాండవీయను మంగళవారం ఢిల్లీలో కలిశారు. యూనివర్సిటీలో న్యాయ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి తరగతులు ప్రారంభించేలా అవసరమైన అనుమతులు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా వచ్చేలా చూడాలన్నారు. అలాగే, కేంద్ర స్పోర్ట్స్, యువజన వ్యవహారాల మంత్రిని విశ్వవిద్యాలయానికి ఖేలో ఇండియా పథకం కింద మంజూరు చేసిన నిధులు త్వరగా అందించాలని కోరారు. ఖేలో ఇండియా నిధులు విశ్వవిద్యాలయానికి మంజూరు చేయడంలో బండి సంజయ్ కృషి ఎంతో ఉందని చెప్పారు. ఇక్కడ కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన సీపీ

మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న సీపీ

మానకొండూర్, ఏప్రిల్ 1: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని మానకొండూర్, కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా చోట్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి, స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాల నమోదుకు సంబంధించి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీస్ అధికారులను నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, త్రీటౌన్, మానకొండూర్ సీఐలు జాన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 1: యువతి మిస్సింగ్ కేసును జమ్మికుంట పోలీసులు ఛేదించారు. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మోత్కుల గూడెంకు చెందిన బిట్ల భవ్య గత నెల 26న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. భవ్య ఫోన్ నంబర్‌ను ఉపయోగించి సీడీఆర్ ద్వారా కొన్ని అనుమానిత నంబర్లను తీసుకుని విచారణ చేశారు. అందులో జిల్లాలోని నగునూరుకు చెందిన జలపతి శ్రీకాంత్‌కు ఎక్కువసార్లు ఫోన్ చేయడాన్ని గుర్తించారు. కాగా, అప్పటికే భవ్య, శ్రీకాంత్‌ను వివాహం చేసుకుని కరీంనగర్ త్రీటౌన్‌లో ఉన్నదని సమాచారం తెలుసుకున్నారు. అక్కడి ఠాణాకు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన జమ్మికుంట పోలీసులు, భవ్యను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్

శంకరపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని సీపీఎం నాయకులను కేశవపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీ (హెచ్‌సీయూ) వద్ద జరిగే ధర్నాకు వెళ్లకుండా మంగళవారం ఉదయం సీపీఎం నాయకులు వెల్మరెడ్డి రాజిరెడ్డి, వడ్ల రాజును ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లతో ప్రజా ఉద్యమాలను ఆపలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీ 400 ఎకరాల భూమిని వేలం వేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల వితరణ

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని కాకతీయ ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటర్ 15 దగ్గర పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్(రిటైర్డ్ టీచర్) మజ్జిగ ప్యాకెట్లు వితరణ చేశారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు 34 మంది కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఎస్సారెస్పీ రిటైర్డ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, లస్కర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

గంగాధర, ఏప్రిల్ 1: మధురానగర్‌లో కొనసాగుతున్న గంగాధర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న ఠాగూర్ కింగ్స్ జట్టుకు కొండగట్టు అవని రిసార్ట్ యజమాని కర్ర శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం టీషర్టులు అందజేసి, క్రీడాకారులను ప్రోత్సహించారు. శ్రీనివాస్‌రెడ్డికి క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు ఠాగూర్, ఒడ్నాల వంశీ, కుమారస్వామి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని తాడికల్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. తాడికల్ గ్రామానికి చెందిన జనగాం చంద్రమౌళి, హుస్నాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి ద్విచక్ర వాహనాలపై వస్తుండగా తాడికల్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కింద పడగా ఇద్దరికీ గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని 108 వాహనంలో కరీంనగర్ దవాఖానకు తరలించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- 136 మంది లబ్ధిదారులకు రూ.33.29 లక్షల విలువైన చెక్కుల పంపిణీ

లబ్ధిదారుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, ఏప్రిల్ 1: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసా కల్పిస్తున్నదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన 136 మంది లబ్ధిదారులకు సుమారు రూ.33.29 లక్షల విలువ గల చెక్కులను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, బీఆర్ఎస్ కరీంనగర్, కొత్తపెల్లి మండలాధ్యక్షులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కాసారపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తోట రాములు, కంసాల శ్రీనివాస్, దుర్యేడ్ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, నాయకులు పండుగ నర్సయ్య, ప్రశాంత్ రెడ్డి, చందు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నగరంలోని కమాన్ ప్రాంతంలో విశ్వబ్రాహ్మణ అఫీషియల్, ప్రొఫెషనల్ (వోపా)అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన వోపా సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు మహేశ్, జంగిలి సాగర్, వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి, గౌరవాధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, జిల్లా అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి శంకరయ్య, అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్ పాల్గొన్నారు.

జీకే యూత్ సభ్యుడి కుటుంబానికి పరామర్శ

కొత్తపల్లి, ఏప్రిల్ 1: బావుపేట గ్రామానికి చెందిన జీకే యూత్ సభ్యుడు వొల్లాల చందు గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాము అండగా ఉంటానని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలతా మహేశ్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ ఎంపీటీసీలు మనోహర్, లక్ష్మణ్, అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, దూలం ప్రకాశ్ గౌడ్, మధుగౌడ్, గాలిపల్లి రవీందర్ ఉన్నారు.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు: కార్గో ఆర్ఎం

తెలంగాణచౌక్, ఏప్రిల్ 1: భద్రాది సీతారాముల కల్యాణ తలంబ్రాలను బుక్ చేసుకున్న భక్తులకు వారి ఇంటి వద్దకే తీసుకువచ్చి అందిస్తామని కార్గో కరీంనగర్ రీజియన్ మేనేజర్ రామారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల కార్గో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఆరు వేల మంది తలంబ్రాలు బుక్ చేసుకున్నారని వెల్లడించారు. భక్తులు కార్గో సెంటర్‌లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే, రాములోరి కల్యాణం తర్వాత తలంబ్రాలను తమ ఏజెంట్ల ద్వారా ఇంటికే డెలివరీ చేయనున్నట్లు వివరించారు. కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖనిలోని కార్గో సెంటర్లు 24 గంటల పాటు పని చేస్తాయని తెలిపారు. వివరాల కోసం కరీంనగర్ - 9154298581, గోదావరిఖని-9154298554, జగిత్యాల-7780250439 సెల్ నంబర్లలో కార్గో సెల్స్ ఎగ్జిక్యూటివ్స్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బీసీ ఆజాద్ ఫెడరేషన్ రిలే దీక్షలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 1: బీసీ ఆజాద్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తున్న నిరాహార దీక్షకు మద్దతుగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చిలుక మారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలన్నారు. ఈ దీక్షకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ముక్కెర రాజుతో పాటు వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఆజాదీ ఫెడరేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చిందం సునీత, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఇప్పకాయల సాగర్, రాష్ట్ర మహిళా నాయకురాలు బింగి రాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి జినుకల లక్ష్మణ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు సమయానికి వస్తున్నాయా?

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

తెలంగాణచౌక్, ఏప్రిల్ 1:ఆర్టీసీ బస్సులు సమయానికి వస్తున్నాయా?.. ప్రతినెలా ఎన్ని రోజులు బస్సులో ప్రయాణిస్తారు? లాంటి ప్రశ్నలతో ఆర్టీసీ సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఆర్టీసీ సంస్థ అందిస్తున్న సేవలపై మూడు రోజుల పాటు కొనసాగే ఈ సర్వేను సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా డిపో పరిధిలోని ప్రతి బస్టాండ్‌తో పాటు రెక్వెస్టు స్టాపుల్లో ప్రయాణికులను కలిసి వివిధ అంశాలతో పాటు వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. సర్వేలో భాగంగా రోజూ వంద మంది ప్రయాణికుల అభిప్రాయాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టారు. డిపో సిబ్బందితో పాటు డ్రైవర్లు, కండక్టర్లకు సర్వే విధులు కేటాయించారు. సర్వే వివరాలను యాప్‌లో ఎంటర్ చేస్తున్నారు. ప్రయాణికుల పేర్లు, చిరునామా, సెల్‌ఫోన్ నంబరు మాత్రం బుక్‌లో రాసుకుంటున్నారు. ఈ సర్వేతో ఆర్టీసీ సేవలను మరింత మెరుగు పరచనున్నట్లు ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై కమిషన్ సమీక్ష రేపు

కలెక్టరేట్, ఏప్రిల్ 1: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, అట్రాసిటీ కేసులపై ఈ నెల 3న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్షించనున్నట్లు, కమిషన్ కార్యదర్శి జీఎస్ పాండాదాస్ తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో జరిగే రివ్యూ సమావేశంలో కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబూ నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్ల శంకర్, రేణుకుంట్ల ప్రవీణ్ పాల్గొని అట్రాసిటీ కేసులపై, అనంతరం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆర్‌వోఆర్ సమస్యలపై సమీక్షించనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

హెచ్‌సీయూ భూముల కబ్జాకు కుట్ర

విద్యార్థుల అణచివేత దుర్మార్గం

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 1: గొప్ప చరిత్ర ఉన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కబ్జా చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. హెచ్‌సీయూ భూముల పరిరక్షణ కోసం విద్యార్థుల చేస్తున్న పోరాటాన్ని అణచివేసేందుకు ప్రయత్నించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వం తీరును తీవ్రంగా ఖండించారు. వందల సంఖ్యలో బుల్డోజర్లు, జేసీబీలు పెట్టి అక్కడున్న చెట్లను నరుకుతూ.. జంతువులను చంపివేస్తూ భూములను కబ్జా చేసేందుకు ప్రభుత్వం ఆరాటపడతున్నదని మండిపడ్డారు. పశ్చిమ హైదరాబాద్‌కు ఊపిరినిచ్చే కొన్ని గ్రీన్ ప్రాంతాల్లో ఈ యూనివర్సిటీ, దాని చుట్టూ ఉన్న ప్రాంతాలేనని, భవిష్యత్తులో ఢిల్లీ మాదిరిగా ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ చేయకుండా 400 ఎకరాల భూములను ఎలా అమ్ముతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూములను అమ్మే ముందు పర్యావరణానికి జరిగే అనర్థంపై అధ్యయనం చేయాలన్న కనీస అవగాహన ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. భూముల రక్షణకు అడ్డొచ్చిన విద్యార్థులను, ఆడబిడ్డలపై విచక్షణరహితంగా పోలీసులు చేత దాడి చేయించడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. ఈ అంశంపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారని గుర్తు చేశారు. గతంలో రెండు సార్లు యూనివర్సిటీకి వచ్చిన రాహుల్‌గాంధీ ఇప్పుడింత జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులైన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు లాంటి వాళ్లు ఈ అంశంలో ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని ప్రభుత్వం నిలిపివేయకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొడతారని హెచ్చరించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 1: హెచ్‌సీయూ భూముల వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని మంగళవారం నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి బొగేశ్వర్, నాయకులు సందేశ్, భారత్, కళ్యాణ్, శివ, మహేశ్, దత్తు, వసంత్, కిరణ్, దీక్షిత్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు చేస్తే ఊరుకునేది లేదు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులను ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేస్తే ఊరుకునేది లేదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ తేల్చి చెప్పారు. జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములను వేలం వేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. యూనివర్సిటీలో మోహరించిన పోలీసులను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థుల తరపున సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇక్కడ జిల్లా ఉపాధ్యక్షుడు లోకిని రమేశ్, రాజేశ్, దేవేందర్, నాయకులు ఉన్నారు.

హెచ్‌సీయూ భూమి వేలం వెంటనే నిలిపివేయాలి

కొత్తపల్లి, ఏప్రిల్ 1: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయకుంటే విద్యార్థి, ప్రజా తిరుగుబాటు తప్పదని లంబాడ జేఏసీ చైర్మన్ భూక్యా తిరుపతినాయక్ హెచ్చరించారు. హెచ్‌సీయూ భూమిని విక్రయించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమాలను అణచివేస్తున్న ప్రభుత్వం

తెలంగాణచౌక్, ఏప్రిల్ 1: హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన శాంతి యుత ఉద్యమాలను అణవేయాలని ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలను అణచివేసే ప్రభుత్వాలు ఎక్కువ కాలం మనుగడ కొనసాగలేవన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా యూనివర్సిటీ భూములను అమ్మకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

బంద్ కాదు.. బకాయిలే కారణం

ఆస్తి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించిన నగరపాలక సంస్థ బకాయిదారులపై కొరడా ఝుళిపిస్తున్నది. ఈ క్రమంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ క్లబ్‌కు చెందిన షెట్టర్లను సీజ్ చేయడంతో దుకాణాలు తెరుచుకోక బంద్ వాతావరణం కనిపించింది.

-కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వ్యాయామ ఉపాధ్యాయ కార్యవర్గానికి అభినందన

కొత్తపల్లి, ఏప్రిల్ 1: నూతనంగా ఎన్నికైన కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ కార్యవర్గాన్ని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి అభినందించారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో కరీంనగర్ జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బాబు శ్రీనివాస్, కార్యదర్శి ఆడేపు శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు గిన్నె లక్ష్మణ్, నర్సయ్య, బన్సీలాల్, పి. శ్రీనివాస్, వీరన్న, ఎస్ రమేశ్, హరికిషన్, వెంకటరమణ పాల్గొన్నారు.

'సుప్రీం' నిర్ణయం హర్షణీయం

కలెక్టరేట్, ఏప్రిల్ 1 : పదకొండేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం కేసులో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించడంపై హర్షణీయమని సహాయ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ వంగ రాజ్‌కమల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని లక్ష్మీనగర్‌లో గల ఆ సంస్థ కార్యాలయంలో సమాజంలో పెరుగుతున్న లైంగిక వేధింపులు ఎదుర్కొనేందుకు బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారత అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న నిర్ణయం పిల్లల హక్కుల పరిరక్షణకు ముందడుగుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా బాలల హక్కులకు భంగం వాటిల్లినట్లు భావిస్తే తమకు సమాచారమందించాలని కోరారు. సమావేశంలో పలు మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఉపాధ్యక్షుడిగా గంగారెడ్డి

గంగాధర, ఏప్రిల్ 1: ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని మంగపేట గ్రామానికి చెందిన భైరి గంగారెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో రెడ్డి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసి తోటి తెగ మండలాధ్యక్షుడిగా సోయం

సైదాపూర్, ఏప్రిల్ 1: ఆదివాసి తోటి తెగ మండలాధ